# పరివర్తన

రవిచంద్ర తెగ హడావుడి పడిపోతున్నాడు. ఆరోజు చెల్లెలికి పెళ్ళిచూపులు. చెప్పిన టైంకే అబ్బాయి, పేరేంట్స్, మధ్యవర్తి నలుగురూ దిగారు.

అబ్బాయి తండ్రి మూర్తి రవిచంద్ర ఒకర్నొకరు చూసుకుంటూ ఇద్దరూ షాకయ్యారు. పేరయ్య వధూవరుల ఫోటోలు చూపించి పెళ్లి చూపులు అరేంజ్ చేశాడు తప్ప కుటుంబ నేపథ్యాలు ఇరువర్గాలకి తెలియపర్చలేదు. అదీ కారణం! గతంలోకి వెళితే...

✣ ✣ ✣

సూర్యనారాయణమూర్తి పి.ఎఫ్. ఆఫీసుకి రావడం ఇది నాలుగవసారి. ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్‌గా పన్జేసి రిటైర్ అయ్యాడాయన. అతడ్ని చూస్తూనే ముభావంగా ఉండిపోయాడు చెక్కుల డెలివరీ సెక్షన్ క్లర్క్ రవిచంద్ర.

"ఏంసార్? ఆ కాగితం తెండి, ఈ కాగితం సరిగాలేదు అంటూ ఎన్నిసార్లు తిప్పుతారు. ముసలిప్రాణం తిరగలేకపోతున్నాను" ఎదురుగా కూర్చుంటు సౌమ్యం ప్రదర్శించాడు.

"ఫార్మాలిటీస్ కదండీ! మీరు సబ్మిట్ చేసిన పేపర్స్‌లో ఏదీ సవ్యంగా లేకపోయినా నా సర్వీస్‌కి బ్యాడ్ పీరియడ్ అవుతుంది. మీకోసం నేనెందుకు రిస్క్ తీసుకోవాలి?" చెప్పాడు రవిచంద్ర.

"మీరిస్క్‌కి ఏమైనా పర్సనల్ పేమెంట్ ఉంటే చెప్పండి. చెల్లించుకుంటాను"

"ఎంతిస్తారు?"

"మీరేటెంతో?"

"నాకంటే మీకే బాగా తెలిసుండాలి. సీనియర్ ప్లస్ అనుభవజ్ఞులు కదా!" వెటకారం ధ్వనించింది రవిచంద్ర స్వరంలో.

"ఎన్నేండ్ల సర్వీసుండేంటీ? చాలా తెలివిగా మాట్లాడుతున్నారు"

"ఆరు నెలల క్రితమే పోస్టింగ్ వచ్చింది. అయితేనేం అనుభవజ్ఞులతో వ్యవహరించ డానికి తెలివితేటలతో పనేం లేదు"

"కొత్తగా జాయినయ్యానంటున్నావు. వయసులో చిన్నవాడివి. యువరక్తం కదా! అప్పుడే ఆమ్యామ్యాలకై వెంపర్లాడుతున్నావేం?" ఏకవచనంలోకి దిగుతూ చురకేశాడు.

తొట్రుపడలేదు రవిచంద్ర.

"ఫ్రెష్‌గా ఉద్యోగం సంపాదించాను కానీ సవ్యంగా జరగలేదది. ప్రజ్ఞ ఉండీ లంచం పెట్టాల్సి వచ్చింది. మరి నేనిచ్చిన డబ్బు తిరిగి సమకూర్చుకోవాలంటే అందినంత దండుకోవాల్సిందేగా?" అన్నాడు. తడబడ్డాడు సూర్యనారాయణ.

"అయినా మీరు నీతులు వల్లించడమేంటండీ! ఇంటర్వ్యూకి వెళ్లేముందు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అడిగారు. అది తెచ్చుకోవడానికి నానా తంటాలు పడాల్సి వచ్చింది. చివరికి ఆ సర్టిఫికెట్‌తో ఆర్డర్స్ వచ్చాయి. మీవరకు వచ్చేసరికి తప్పొప్పులు గుర్తొచ్చాయా?" రవిచంద్ర మాటలు శూలాల్లా తగిలాయి మూర్తికి.

'నిజమే! తన కెరీర్‌లో ఎంతమంది నిరుద్యోగుల దగ్గర డబ్బు గుంజలేదు?' తొలిసారిగా అతని మనసులో తలెత్తిందా ప్రశ్న. వివర్ణమయ్యిందతని వదనం.

"మీలాంటివాళ్ళ వల్లనే సార్! ఉద్యోగంలో చేరిన నాలాంటి నిజాయితీపరులు సైతం పెడతోవన పడుతున్నారు. తమ డబ్బు తాము రాబట్టుకోవడానికి ఇలాంటివి అలవాటు చేసుకుంటున్నారు. ఎలాగైనా నాకీ ఉద్యోగం రావాలని కిరాణకొట్టులో గుమస్తాగా చేస్తున్న నా తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. సహజమైన మరణంగా ధృవీకరించబడడంతో వచ్చిన ఎల్ఐసి డబ్బులతో నేనీ కుర్చీలో..." మధ్యలోనే రవిచంద్ర స్వరం మారిపోయింది.

కంటతడిచేరింది. అదిరిపడ్డాడు మూర్తి. మొదటిసారి గుండె ప్రకంపితమైంది. గొంతు పెగుల్చుకుని "క్షమించు బాబూ!" అని మాత్రం అనగలిగాడు.

ఆయనలోని పరివర్తనని గమనిస్తూ రవిచంద్ర అన్నాడు. "డబ్బుకి కక్కుర్తిపడి మీ చెక్కుని ఆపలేదు. ఎదుటివారి కష్టం తెలిసి రావాలని చేశానిలా. నాకు ఒక్క నయాపైసాతో పనిలేదు. నాకొచ్చే జీతం సంతృప్తికరంగా ఉంది" అంటూ టేబుల్ సొరుగులోంచి చెక్కు తీసి మూర్తి చేతికి అందించాడు రవిచంద్ర. థ్యాంక్స్ చెప్పి బయటపడ్డాడు మూర్తి.

✤ ✤ ✤

అదీ జరిగింది. సూర్యనారాయణమూర్తి మాత్రం రవిచంద్రతో ముభావంగానే ఉండిపోయాడు. పెళ్లిచూపుల తతంగం అవిఘ్నంగా జరిగింది. వధూవరులిద్దరు పరస్పరం ఇష్టపడ్డారు. వెళ్లిపోయే ముందు మూర్తి ఏకాంతంగా రవిచంద్రతో మాట్లాడాడు.

"బాబూ! జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఈ సంబంధం దృష్ట్యా మళ్లీ మనం కలుసుకోవడం దైవికమే. మా అందరికి అమ్మాయి నచ్చింది. మీ చెల్లెలు నచ్చినందువల్లే మా ఇంటికోడల్ని చేసుకుంటున్నాం. కానీకట్నం లేకుండా పెళ్లి జరుగుతుంది. మా అబ్బాయి గురించి మీరు అన్నీ వాకబు చేసుకుని, సంతృప్తి చెందాకె పెళ్లి జరిపిద్దాం. అన్ని చోట్ల వాకబు చేసుకోండి. నిర్ణయం మీ చేతుల్లో ఉంది" అన్నారాయన.

రవిచంద్ర వదనం ప్రసన్నమైంది. (సెప్టెంబర్, 2005)

✳